

2 లో..

## కానూరు వెంకటేశ్వరరావు వర్ధంతి


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




## నల్లగొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

శనివారం 11 ఏప్రిల్ 2026 పేజీలు : 14


# ఆయుర్వేద, హోమియోపతిపై ప్రజల్లో అవగాహన కల్పించాలి..

ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పలు కార్యక్రమాలు..

హోమియోపతి నర్సింగ్ విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..

జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



నల్లగొండ ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి ప్రతినిధి )

: ప్రజలు సహజ వైద్య విధానాల వైపు మళ్లేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను సూచించారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం అయన ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రి లో నిర్వహించిన హోమియోపతి డే సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద, యునాని, హోమియోపతి విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ...మిగతా 2లో



## చేనేతలను ప్రభుత్వం ఆదుకుంటుంది

6 లో..

# నాస్ ఫార్మాస్యూటికల్ లేబరేటరీ తనిఖీ..

అగ్ని ప్రమాదం పై పూర్తి విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలి

ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి ప్రతినిధి ):

నల్గొండ జిల్లా, చిట్యాల మండలం వెలిమినేడు సమీపంలోని నాస్ ఫార్మసిటికల్ ప్రైవేట్ లిమిటెడ్ లో సంభవించిన అగ్ని ప్రమాదం పై పూర్తి విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ,జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ లు ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ప్రభుత్వ విప్ వేముల వీరేశం తో కలిసి ప్రమాదం సంభవించిన నాస్ ఫార్మాస్యూటికల్ లేబరేటరీని తనిఖీ చేశారు.అగ్ని ప్రమాదం సంభవించడానికి గల కారణాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు .చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అగ్నిమాపక శాఖ, స్థానిక తహసిల్దారు, ఎంపీడీవోలు ప్రమాద సంఘటనపై తక్షణమే నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అంతేకాక ...మిగతా 2లో



## జిల్లా అదనపు కోర్ట్ ను భువనగిరి నుండి తరలించకుండా చర్యలు తీసుకువాలి



2

# కానూరు వెంకటేశ్వరరావు వర్ధంతి

**ఆలేరు ఏప్రిల్ 10 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో సిపిఐ ఎంఎల్ ఎన్ డి ఆర్ ఆధ్వర్యంలో కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు 11వ వర్ధంతి అరుణోదయ సంస్కృతిక సమైక్య రాష్ట్ర నాయకులు కామ్రేడ్ పంగ అంజయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పంగ రవి, మల్లేష్ వరలక్ష్మి ,సునీత ,నాగరాజు, సరిత, అంజయ్య ,జయమ్మ ,సత్తెమ్మ ,సునీల్ , అంజయ్య,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అదనపు కోర్ట్ ను భువనగిరి నుండి తరలించ కుండా చర్యలు తీసుకువాలి

**బార్ అసోసియేషన్ అధ్యక్షులు నిసంగి విద్యా సాగర్**



**భువనగిరి,ఏప్రిల్ 10**

(ప్రజాజ్యోతి)భువనగిరి కోర్టు బార్ అసోసియేషన్ "అధ్యక్షులు నిసంగి విద్యా సాగర్ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు జిల్లా అదనపు కోర్టును భువనగిరి నుండి రామన్నపేట తరలిస్తున్నారని దానితో చాలా ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు.అదే విధంగా భువనగిరి మరియు గ్రామాలకు చెందిన కక్షిదారులు వెళ్లలేరని ఆవేదన వ్యక్తం చేసారు.కావున పై విషయాన్నీ ముఖ్యమంత్రి దృష్టికి న్యాయ వ్యవస్థ దృష్టికి తీసుకెళ్లి భువనగిరి నుండి అదనపు కోర్టు ను రామన్నపేట కు తరలించకుండా ఆపాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఖచ్చితంగా ఇట్టి విషయం లో న్యాయం చేస్తానని అన్నారని తెలిపారు.ఈ కార్యక్రమం లో శ్రీనివాస్ రెడ్డి మేడబోయిన యాదగిరి,శారదా ఉడతా సురేష్ పడాల శ్రీనివాస్ గోదా వెంకటేష్ బొమ్మ వెంకటేష్ బార్ కౌనిల్ సభ్యులు సీనియర్ నాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లకు డ్రగ్స్ పరీక్షలు.. పలువురికి పాజిటివ్

**హైదరాబాద్,**

నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదేశాల మేరకు హైదరాబాద్ నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లకు పోలీసులు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. నగరవ్యాప్తంగా మొత్తం 1300 మంది రౌడీషీటర్లను గుర్తించారు. వారిలో 239 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. 189 మందికి పాజిటివ్ వచ్చింది. మిగిలిన 50 మందికి నెగటివ్ వచ్చింది.వీరంతా గంజాయికి అలవాటు పడినట్లు పోలీసులు గుర్తించారు. గంజాయి ఎక్కడ నుంచి వస్తుందంటూ వారిని పోలీసులు విచారిస్తున్నారు. గాంధీ ఆసుపత్రిలో 70 మందికి పరీక్షలు నిర్వహించగా.. 44 మందికి పాజిటివ్, 26 మందికి నెగటివ్, ఉస్మానియా ఆసుపత్రిలో 80 మందికి పరీక్షలు చేయగా.. 59 మందికి పాజిటివ్, 21 మందికి నెగటివ్, ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో 89 మందికి పరీక్షలు చేయగా 86 మందికి పాజిటివ్, ముగ్గురికి నెగటివ్ వచ్చింది.

# ఆయుర్వేద, హోమియోపతి పై ప్రజల్లో అవగాహన కల్పించాలి..

**ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పలు కార్యక్రమాలు..**

**హోమియోపతి నర్సింగ్ విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..**

**జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్**








(మొదటి పేజీ తరువాయి)

శిబిరాన్ని ప్రారంభించారు. హోమియోపతి పితామహుడు డాక్టర్ సామ్యూల్ హానీమాన్ చిత్రపటానికి పూలమాల అర్పించి నివాళు లు ఘటించారు.ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఇందులో భాగంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. హోమియోపతి నర్సింగ్ విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బయట తినుబండారాలను తగ్గించి, శుభ్రమైన మరియు పోషకాహారం, తాజా పండ్లు తీసుకోవాలని సూచించారు.నర్సింగ్ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే ఇతరులకు సేవ చేయగలుగుతారని , వైద్య వృత్తిలో ఉన్నవారు ఆరోగ్యంగా ఉండటం అత్యంత అవసరమని తెలిపారు.అలాగే గతంలో క్యాన్సర్, ప్లేగు వంటి వ్యాధులకు సరైన చికిత్సలు లేక ప్రజలు ప్రాణాలు కోల్పోయేవారని, ప్రస్తుతం వైద్య రంగంలో ఎంతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. అయితే సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుర్వేద, యునాని, హోమియోపతి వైద్య విధానాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు నిత్యం వ్యాయామం, యోగా, జిమ్ వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు.కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి, వైద్య శిబిరం ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్వో వేణుగోపాల్ రెడ్డి, యునాని వైద్య అధికారి డాక్టర్ ముబీన్ పర్వీన్, ప్రోగ్రాం ఇన్చార్జ్ సుహాసిని,డిప్యూటీ సూపరింటెండెంట్ గణేష్ ,తదితరులు, హాజరయ్యారు.

# నాస్ ఫార్మాస్యూటికల్ లేబరేటరీని తనిఖీ..

**అగ్ని ప్రమాదం పై పూర్తి విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలి**

**ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం**

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

(మొదటి పేజీ తరువాయి)

నాస్ కంపెనీకి ఉన్న అనుమతులపై నివేదిక ఇవ్వాలని, ఉద్యోగుల భద్రత పట్ల తీసుకున్న చర్యల పై పోలీసులు నివేదిక సమర్పించాలని కలెక్టర్, ఎమ్మెల్యేలు ఆదేశించారు.గురువారం రాత్రి చిట్యాల మండలం, వెలిమినేడు వద్ద ఉన్న నాస్ ఫార్మాస్యూటికల్ లో రియాక్టర్ వద్ద సంభవించిన అగ్ని ప్రమాదంలో ఉద్యోగులు వెంకటేశ్వర్లు ,లక్ష్మణ్ కుమార్లు గాయపడగా ,వీరిని హైదరాబాద్ లోని డిఆర్డిఓ అపోలో ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితి పై ఎప్పటికప్పుడు ఆసుపత్రి వారితో మాట్లాడడం జరుగుతున్నదని, అంతేకాక పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ప్రమాద సంఘటనపై విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించడం జరిగిందని, ముఖ్యంగా సంఘటన జరగడానికి గల కారణాలు, ప్రమాదం అనుకోకుండా జరిగిందా లేదా ఎవరి తప్పిదం వలన సంభవించిందా అన్నది తెలియజేయాలని, సాంకేతికపరంగా సమస్య కారణంగా ప్రమాదం తలెత్తితే అందుకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. నాష్ కంపెనీకి పొల్యూషన్ అనుమతితో పాటు, ఇతర అనుమతుల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. చిట్యాల ప్రాంతంలో ఉండే పరిశ్రమలు చుట్టుపక్కల ప్రజలు, కార్మికులు కాలుష్యం బారిన పడకుండా చూడడంతో పాటు, కార్మికులు, ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఉందని ఎవరి ప్రాణాలకు హాని కలిగినా యాజమాన్యంపై చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ప్రత్యేకించి పరిశ్రమలో పనిచేసే ఉద్యోగుల భద్రత



చూసుకోవాల్సిన బాధ్యత పూర్తిగా యాజమాన్యంపై ఉందని, అలాగే పర్యావరణాన్ని సైతం ఎప్పటికప్పుడు కాపాడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరిని హైదరాబాదులోని డి ఆర్ డి ఎల్ అపోలో ఆస్పత్రికి పంపించి మెరుగైన చికిత్స అందించడం జరుగుతున్నదని ,ప్రమాద సంఘటనపై వివిధ శాఖల విచారణ నివేదికలను కోరడం జరిగిందని, ప్రమాదంలో గాయపడిన ఉద్యోగుల కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కంపెనీ తరఫున అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన కంపెనీ యాజమాన్యాన్ని ఆదేశించారు.ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ శ్రీదేవి, చిట్యాల తహసిల్దార్ విజయ్, ఇతర అధికారులు ఉన్నారు.

# చందేపల్లిలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణకు మందకృష్ణ మాదిగ రాక



ఆలేరు, ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని చందేపల్లిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ ల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నారని ఆ సమితి మండల అధ్యక్షుడు ఆడేపు శ్రీనివాస్ మాదిగ తెలిపారు. మండలంలోని చందేపల్లిలో ఆ సమితి నాయకులతో కలిసి విగ్రహాల ఆవిష్కరణకు సంబంధించిన కరపత్రం ను శుక్రవారం విడుదల చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాదిగ, ఉపకుల మేధావులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక వర్గాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. విగ్రహావిష్కరణ కార్యక్రమం సామాజిక న్యాయం, సమానత్వం, స్వాభిమానానికి ప్రతీకగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి గోసంగి పరమేష్ మాదిగ, మాజీ సర్పంచ్ బొట్ల నరసింహ మాదిగ, గ్రామ శాఖ అధ్యక్షుడు క్యాడిగళ్ళ నరసింహ మాదిగ, చాడ గ్రామ శాఖ అధ్యక్షుడు గంధమల్ల శ్రీనివాస్ మాదిగ, టౌన్ నాయకులు బొట్ల నవీన్ మాదిగ, బొట్ల నరేష్, బొట్ల గణేష్, పానుగంటి నరసింహ పాల్గొన్నారు.

# కొండమల్లేపల్లి సర్పంచుల ఫోరం లో గందరగోళానికి చెక్

## ఎమ్మెల్యే సూచనలతో పాత అధ్యక్షురలు సరస్వతి రావినాయక్ కొనసాగింపు

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 10,(ప్రజాజ్యోతి):

మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలిగా రామావత్ సరస్వతి రవి నాయక్ కొనసాగుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం అమల్లో ఉందని ఆమె స్పష్టం చేశారు. మండలంలోని కొల్మంతల్ పహాడ్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న సరస్వతి రవి నాయక్‌ను ఈ ఏడాది జనవరి 3న 18 గ్రామ పంచాయతీల సర్పంచులు ఏకగ్రీవంగా ఫోరం



అధ్యక్షురాలిగా ఎన్నుకున్న విషయం గుర్తుచేశారు. అనంతరం ఎమ్మెల్యేను కలిసి, ఆయన సూచనల మేరకు మండల ఎంపిడివో స్వర్ణలతను కలిసి నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. దీనికి అధికారులు ఆమోదం తెలుపుతూ కార్యాలయ ముద్రతో పత్రాన్ని అందించినట్లు చెప్పారు. తదనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదేశాల ప్రకారం తాను అధ్యక్షురాలిగా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన సర్పంచుల ఫోరం అధ్యక్ష ఎన్నికను పరిగణలోకి తీసుకోరాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా జక్కుల వీరయ్య

## -అడ్వకేట్ల ఆధ్వర్యంలో గజమాలతో ఘన సన్మానం



హుజూర్ నగర్, ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి):

హుజూర్ నగర్ బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్ గా జక్కుల వీరయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం బార్ అసోసియేషన్ హాల్ లో తోటి న్యాయవాదులు ఆయనకు భారీ గజమాల వేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జక్కుల వీరయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అత్యధిక మెజారిటీతో గెలిపించిన న్యాయవాదులకు, పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమానికి, బార్ అసోసియేషన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యుల మధ్య సమన్వయం పెంచేలా ప్రణాళికలు రూపొందిస్తామని, జూనియర్ న్యాయవాదులకు అండగా ఉంటానని తెలిపారు. బార్ అసోసియేషన్ సీనియర్ నాయకులు, న్యాయవాదులు, పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొని వీరయ్యకి మిఠాయిలు తినిపించి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కొణతం శ్రీనివాస్ రెడ్డి, నగేష్ రాథోడ్, పల్లి అలెగ్జాండర్, కుక్కడపు సైదులు, గురుమూర్తి, నారాయణ రెడ్డి, విజయదుర్గ, పండ్ల నాగరాజు, ఉదారి యాదగిరి, పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, శృతి, పెండెం సాయి, కందుల శంభిరెడ్డి, బ్రహ్మాచారి, చందు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# క్షయ నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

## -కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మా

## హుజూర్ నగర్



హుజూర్ నగర్ ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి)

క్షయ నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మా అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని మాధవ రాయని గూడెం బస్తీ దవాఖాన లో నిక్షయ్ శిబిర్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ నిక్షయ్ శిబిర్ ప్రచారం అనేది భారత దేశాన్ని క్షయ రహిత దేశంగా మార్చే లక్ష్యంతో 100 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమమన్నారు. క్షయ నిర్ధారణ కొరకు స్ఫుటం పరీక్ష, ఎక్స్రే పరీక్ష, సైట్ టీబి ఇంజక్షన్ ద్వారా పరీక్ష నిర్వహించి రోగులను త్వరితంగా గుర్తించడం సకాలంలో వారికి మందులు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది ఇందిరాల రామకృష్ణ, ఆర్ మాధవి, ఉదయగిరి శ్రీనివాస్, గండు ప్రశాంతి, ట్రీట్మెంట్ సూపర్వైజర్ మమత, ఐసీటీసీ కౌన్సిలర్ విజయ్, మాధవరాయన గూడెం కౌన్సిలర్లు నందిగామ శ్రీనివాస్, మోదాల కామేశ్వరి సైదులు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉచిత పాలిటెక్నిక్, టిఎస్ ఆర్ జెసి కోచింగ్ ను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడ టౌన్,ఏప్రిల్ 10 ( ప్రజా జ్యోతి):

కోదాడఅంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం (ఆస్క) కోదాడ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్, టిఎస్ ఆర్ జెసి కోచింగ్ కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెస్ కళాశాలలో శుక్రవారం ఆస్క సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆస్క అధ్యక్షురాలు బల్గూరి స్నేహ దుర్గయ్య, ఎమ్మెస్ కళాశాలల చైర్మన్ పందిరి నాగిరెడ్డి, 20 వ వార్డ్ కౌన్సిలర్ జిల్లపల్లి నాగేశ్వరావు,34 వ గంధం బాలేంద్ర పాండు లు పాల్గొని కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆస్క అధ్యక్షరాలు స్నేహ దుర్గయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆస్క ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత పాలిటెక్ ని 14-04-2026 న ఎమ్మెస్ కళాశాల,కోదాడ లో ఉచిత పాలిటెక్నిక్ టి ఎస్ ఆర్ జె సి కోచింగ్ ప్రారంభించబడుతుంది. కావున ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు. ప్రతి సంవత్సరం సబ్జెక్టులో మంచి ప్రావీణ్యత కలిగిన ఉపాధ్యాయ బృందంచే ఉచితంగా శిక్షణ అందించబడుతుందని తెలిపారు. కార్పొరేటు కోచింగ్ సెంటర్లను నమ్మి వేలకు వేలు డబ్బులు వృధా చేసుకోకుండా ఈ ఉచిత పాలిటెక్నిక్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్క ప్రధాన కార్యదర్శి మాతంగి ప్రభాకర్ రావు, జడ్పీహెచ్ఎస్ బేతవోలు జిహెచ్ఎం మాగి గురవయ్య, కోర్స్ డైరెక్టర్ యలమర్తి శౌరి, కోర్సు కోఆర్డినేటర్ గంధం బుచ్చరావు, కుడుముల స్వామి దాసు, నందిపాటి సైదులు, అమరబోయిన వెంకటరత్నం, బొడ్డు హుస్సేన్, చేకూరి రమేష్, ఇరుగు కిరణ్ కుమార్, మేళ్లచెరువు వీరభద్రం, షరీఫ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 9666763660ను సంప్రదించగలరు.



# అంబేద్కర్ జయంతి ర్యాలీ లో అధికంగా ముస్లిం మైనారిటీ లు పాల్గొనాలి

## మౌలానా బాఖియతుల్లాహ్ జిల్లా అధ్యక్షులు ఇంతియాజ్ భీమ్ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

భువనగిరి, ఏప్రిల్ 10





(ప్రజాజ్యోతి)భువనగిరి పట్టణంలోని ఇస్లాంపూర,మజీద్ కమిటీ,ఆధ్వర్యంలో,ఈనెల 14 నాడు బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే భీమ్ యాత్ర ర్యాలీ పోస్టర్ ను మౌలానా బాఖియ తుల్లాహ్ మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ యాదాద్రి జిల్లా అధ్యక్షులు ఇంతియాజ్ అహ్మద్ కలిసి ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ నెలను మహనీయుల జయంతి ఉత్సవ మసంగా జరుపుకుం టున్నామని,ఉత్సవాలలో మహనీయుల యొక్క సేవలు వారి,త్యాగాలను మరియు వారు చేసే పోరాటాలను వచ్చే తరాలకు తెలియజేయటానికి ఉత్సవాలు చాలా దోహదప దతాయని వారు ఈ సందర్భంగా అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపంచ మేధావి తన రాజ్యాంగం ద్వారా బడుగు బలహీనవర్గాల ప్రజల న్యాయమైన సమాన హక్కులను కల్పించారని తెలిపారు. ఈ భీమ్ యాత్రలో ప్రజలు కులమతాలకు అతీతంగా,పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు అదేవిధంగా ఈ నెల 12 సాయంత్రం 6 గంటలకు స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించే మైనారిటీల సమావేశానికి మైనార్టీ లందరూ పాల్గొని కార్యక్రమాలను విజయ వంతం చేయవలసిందిగా అలాగే 14వ తేదీన ర్యాలీ లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్తియాక్ అహ్మద్,బర్కత్ భాయ్,రహీం హనీఫ్,ఖలీల్,ఆసిమ్,ముజీబ్ సలావొద్దీన్ మైసన్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అండర్ డ్రైనేజీలతో మురుగునీటికి శాశ్వత పరిష్కారం: సర్పంచ్ యుగేందర్ రెడ్డి

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 10,(ప్రజా జ్యోతి):

అండర్ డ్రైనేజీల నిర్మాణంతో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి తెలిపారు. మేజర్ గ్రామపంచాయతీ అయిన కొండమల్లేపల్లి పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలో నిర్మాణంలో ఉన్న కొత్త డ్రైనేజీ పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అండర్ డ్రైనేజీల ఏర్పాటు ద్వారా మురుగునీరు బహిర్గతంగా పారకుండా నివారించవచ్చని తెలిపారు. దశల వారీగా ప్రతి వార్డులో డ్రైనేజీ వ్యవస్థను విస్తరించి, ప్రజలకు శుభ్రమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పట్టణంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనులు నాణ్యతతో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, పాలకవర్గం మరియు అధికారుల సమన్వయంతో మరింత అభివృద్ధి సాధిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోడిదాల పద్మా వెంకటయ్య, వార్డు సభ్యులు బిజిలీ లింగం, గంట మల్లేష్ యాదవ్, వాస్కుల శ్రీను, ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




# దొడ్డు రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నాంపల్లి, ఏప్రిల్ ,10(ప్రజా జ్యోతి):మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో దొడ్డు రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం శుక్రవారం ఐకెపి ఆధ్వర్యంలో రైతులతో కలిసి గ్రామ సర్పంచ్ నక్క చంద్రశేఖర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే మండలంలోని మెల్లవాయి గ్రామంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ గూగులోతు దేవ సింగ్ మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో దొడ్డు రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు .ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలన్నారు. ధాన్యం కల్లాలోనే ఆరబెట్టుకొని, మట్టి పెల్లలు, తాలు లేకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంట వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు శైలజ సందీప్, వివో కోరే అలివేలు జయరాం, కార్యదర్శి, కోశాధికారి, వివిధ గ్రామాల సర్పంచ్లు,



# మహిళా ఏఎన్ ఎం, వాచ్ ఉమెన్, స్కావెంజర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిడమనూరు,ఏప్రిల్ 10(ప్రజాజ్యోతి):నిడమనూరు మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహం నందు కాంట్రాక్ట్ పద్ధతిలో మహిళా ఏఎన్ ఎం , వాచ్ ఉమెన్ ,స్కావెంజర్ గా పని చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి లావూరి వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఏఎన్ ఎం అభ్యర్థులు ఇంటర్ , ఏఎన్ ఎం కోర్సు పాసై ఉండాలి . వాచ్ ఉమెన్ 40 సం లోపు వయసు ఉండాలి. నిడమనూరు మండలానికి సంబంధించిన స్థానిక అభ్యర్థులు ఏప్రిల్ 15 వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఇట్టి దరఖాస్తులను మోడల్ స్కూల్ హాస్టల్ నిడమనూరు నందు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం సెల్. నెం .7993354872 కు సంప్రదించాలని కోరారు.




# కంకణాలగూడెంలో ఆగిన ఇండ్లను నిర్మాణం చేయాలి

## స్థలం లేని పేదలకు ఆ ఇండ్లను పంపిణీ చేయాలి

## ఆగిన ఇండ్లను పరిశీలించిన సిపిఐ బృందం

## తాహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చిన నేతలు

సంస్థాన్ నారాయణపురం,

ఏప్రిల్ 10, ( ప్రజాజ్యోతి ) : సంస్థాన్ నారాయణపురం మండలం కంకణాలగూడెం గ్రామంలో బేసిమెంట్ల వరకు నిర్మాణం చేసి ఆగిపోయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసి పేదలకు పంపిణీ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు సిపిఐ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆగిపోయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్ల స్థలాలను పరిశీలించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుబ్బాక భాస్కర్ మాట్లాడుతూ కంకణాలగూడెం గ్రామంలో సర్వేనెంబర్ 164 లో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం బేస్ మెంట్ వరకు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారని ఆరోపించారు. ఇంటి స్థలాలు లేని పేదలకు ఇక్కడే డబల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో నిర్మాణం చేసి వదిలేసిన ఈ డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రస్తుత ప్రభుత్వమైనా పూర్తి చేసి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాతో సమితి సభ్యులు ఛిలివేరు అంజయ్య, మండల కార్యవర్గ సభ్యులు పల్లె మల్లారెడ్డి, ఈద మల్లయ్య, పందుల యాదగిరి, మాజీ ఎంపీటీసీ రుద్ర రాములు, నాయకులు సూరపల్లి జనార్ధన్, గడ్డం యాదగిరి, చిలువేరు రమేష్ భక్తిని మల్లేష్ నోముల యాదయ్య, వలిగొండ యాదయ్య పాల్గొన్నారు.



# ఆలగడప వద్ద ముమ్మర తనిఖీలు...భారీగా నిలిచిన వాహనాలు..!







**మిర్యాలగూడ, ఏప్రిల్ 10,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ మండలం ఆలగడప టోల్ గేట్ వద్ద పోలీస్, రెవిన్యూ, సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా శుక్రవారం ధాన్యం లారీలను ముమ్మరంగా తనిఖీలు చేశారు. ఇతర ప్రాంతాల నుండి అక్రమంగా ధాన్యం తరలి వస్తుందన్న స్థానిక రైతుల ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు గురువారం అర్ధరాత్రి నుండి అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. దీంతో కోదాడ – జడ్చర్ల హైవేపై భారీ ఎత్తున ధాన్యం లారీలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. రైస్ మిల్లుల హబ్ గా ఉన్న మిర్యాలగూడ లో ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం వస్తున్నందున తమ ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని కొద్ది రోజులుగా రైతులు ఆరోపణలు వ్యక్తం చేస్తూ ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిబంధన మేరకు ఇతర రాష్ట్రాలకు చెందిన దాన్యం లారీలకు తెలంగాణలోకి అనుమతి లేదంటూ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రతిలారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి ధాన్యం స్థానికంగా రాష్ట్రానికి చెందినదా లేక ఇతర రాష్ట్రాల నుండి తరలిస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించారు. తనిఖీల అనంతరం ధాన్యం తెలంగాణ ప్రాంతానికి చెందినది కావడంతో లారీలను మిల్లుల వద్దకు అనుమతించారు. రహదారిపై ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.

## రాష్ట్ర ఉత్తమ యూపిహెచ్‌సీ అవార్డు అందుకున్న డాక్టర్లకు ఎమ్మెల్యే సన్మానం



మర్రిగూడ, ఏప్రిల్ 10(ప్రజాజ్యోతి):రాష్ట్ర స్థాయిలో ఉత్తమ యూపిహెచ్‌సీగా అవార్డు అందుకున్న డాక్టర్లను మునుగోడు శాసనసభ్యులు రాజగోపాల్ రెడ్డి సన్మానించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మాతృ, శిశు ఆరోగ్య పోర్టల్, సాధారణ టీకాకరణ (పూర్తి టీకాకరణ శాతం), ఎన్‌సీడీ (రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్) పనితీరు ఆధారంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ యూపిహెచ్‌సీగా సేవలందించిన మర్రిగూడ యూపిహెచ్‌సీకి రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రివర్యుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న డా. శాలినిని, డా. దీపక్ ని మునుగోడు శాసనసభ్యులు రాజగోపాల్ రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ యూపిహెచ్‌సీగా మర్రిగూడ అవార్డు అందుకోవడం డాక్టర్లు సిబ్బంది కృషి ఫలితమని అభినందించారు. ప్రజలకు మరింత చేరువగా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. యూపిహెచ్‌సీ సేవలను యథావిధిగా పాత భవనంలో, కొత్త పీహెచ్‌సీ భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు కొనసాగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మర్రిగూడ మండల అధ్యక్షులు రామదాస్ శ్రీనివాస్,మాజీ జెడ్‌పీటీసీ మేతరి యాదయ్య, డీటీసీవో డా. కళ్యాణ్ చక్రవర్తి, పీహెచ్‌సీ వైద్యులు డా. శాలిని , డా. దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## కోదాడలో అక్రమ ఇసుక టిప్పర్ పట్టివేత:

**కృష్ణా నది నుండి అక్రమ ఇసుక రవాణా, కోదాడలో టిప్పర్ సీజ్**

**డ్రైవర్, యజమానిపై కేసు నమోదు**

కోదాడ రూరల్, ఏప్రిల్ 10( ప్రజాజ్యోతి ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా అమరావతి సమీపంలోని కృష్ణా నది నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు.?ఏపీ 39 ఎక్స్ 0999 నెంబర్ గల టిప్పర్ ద్వారా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను కోదాడ పరిసర గ్రామాలకు తరలిస్తుండగా, శుక్రవారం ఉదయం 06:30 గంటలకు రామలక్ష్మీపురం వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను రవాణా చేస్తున్నట్లు గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.నందిగామ మండలం ఐతవరం గ్రామానికి చెందిన డ్రైవర్ చలమల కోటేశ్వర రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న డ్రైవర్ తో పాటు టిప్పర్ యజమానిపై కూడా కేసు నమోదు చేసినట్లు కోదాడ రూరల్ ఎస్ఐ సిహెచ్ గోపాల్ రెడ్డి తెలిపారు.ఈ అక్రమ ఇసుక రవాణా నెట్‌వర్క్‌లో ఇంకా ఎంతమంది ఉన్నారనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సిహెచ్ గోపాల్ రెడ్డి హెచ్చరించారు.

## చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం




నాంపల్లి, ఏప్రిల్,10(ప్రజా జ్యోతి):వేసవిలో ఎండల నేపథ్యంలో ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మండల తహసీల్దార్ గూగులోతు దేవా సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో బంజార సేనా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మునుగోడు సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మెగావత్ నంద నాయక్ జన్మదిన సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్, నాంపల్లి గ్రామ సర్పంచ్ నక్క చంద్రశేఖర్ కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికుల, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 14 లోపు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలి

**– కమిషనర్ జి.శ్రీనివాస్**

**మిర్యాలగూడ,ఏప్రిల్ 10,( ప్రజాజ్యోతి ):**

కుటుంబ యజమాని చనిపోయినమిర్యాలగూడ పట్టణంలో అర్హులైన వారు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్బిఎస్) కింద ఈనెల 14వ తారీకు వరకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక మునిసిపల్ కమీషనర్ జి. శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ పథకం ద్వారా యజమానిని కోల్పోయిన తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు 20వేల రూపాయల నగదును కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయంగా అందిస్తుందని అన్నారు. పట్టణంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు,భవన నిర్మాణ కార్మికులు , ఇతర పనిచేసే కూలీలు , రైస్ మిల్లు గుమస్తాలు , శానిటేషన్ సిబ్బంది గానీ తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు ఇంటి యజమాని చనిపోయి నట్లయితే మీ సేవలో 14 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కోరారు.



# చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తాం:నిడమానూరు మార్కెట్ చైర్మన్ అంకతిసత్యం

## -ముప్పారంలో ధాన్యం కొనుగోలు ప్రారంభం

నిడమానూరు, ఏప్రిల్ 10(ప్రజాజ్యోతి): మండలంలోని ముప్పారం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతిసత్యం ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తామన్నారు.ప్రభుత్వం కల్పించే మద్దతు ధర పొందాలన్నారు . ముప్పారం ఐకేపి ధాన్యం కొనుగోలు కేంద్రాలన్ని దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యపు ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని తెలియజేశారు.అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకూడదని రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రభీ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు.రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోకూడదని రైతులు తాలు,పొల్లు లేకుండా దాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే ప్రభుత్వ మద్దతు ధర ఏ1 ధర 2389,బి రకం ధర రూ.2369లు పొందాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏవో ముని కృష్ణ, ఏపిఎం నరసింహ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోండా శ్రీనివాస్ రెడ్డి , నిడమానూరు కాంగ్రెస్ పార్టీ నాయకుల పిసిసి డెలికేట్ ముంగి శివ మారయ్య,గుదేగోపు లోహిత్ రెడ్డి, మేరెడ్డి వెంకటరమణ, చెరక శ్రీను, భాస్కరి నారాయణ, అల్లంపల్లి మైసయ్య, శెట్టి వీరేశం, కంచి పాపయ్య,గంగాధర్, సిసిలు నరసింహ్మాచారి,సంగమేష్ ,మహిళా సంఘం సభ్యులు మల్లిక, రమాదేవి, రైతులు ,గ్రామ సంఘ బంధం కమిటీ,పలువురు కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు





,గ్రామప్రజలు,తదితరులు,పాల్గొన్నారు.

# చేనేతలను ప్రభుత్వం ఆదుకుంటుంది

## మరమగ్గాలతో పాటు చేనేతలకు కష్టాలు పెరిగాయి

### పుట్టపాక నేతన్నలకు 4.39 కోట్ల చెక్కుల రుణమాఫీ పంపిణీ

### గట్టుప్పల్ నేతన్నలకు 1.10 లక్షల రుణమాఫీ పంపిణీ

### 60 లక్షల నేతన్నల బీమా, 28 లక్షల నేతన్న భరోసా చెక్కుల పంపిణీ

### మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**సంస్థాన్ నారాయణపురం,**

ఏప్రిల్ 10, ( ప్రజాజ్యోతి ): చేనేత కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో ప్రభుత్వం చేనేత కార్మికులకు రుణమాఫీ కింద మంజూరు చేసిన 141 మంది కోటి పది లక్షల 75 వేల రూపాయల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన 500 మంది నేతన్నలకు 4.39 కోట్ల రూపాయల రుణమాఫీ చెక్కులను



పంపిణీ చేశారు. నేతన్నల బీమా పథకం కింద 12 కుటుంబాలకు 60 లక్షల రూపాయలు చెక్కులను పంపిణీ చేశారు. 28 లక్షల రూపాయల భరోసా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మరమగాల వలన చేనేత కార్మికులకు ఉపాధి కరువైందని వివరించారు. కార్మికులకు టెక్నాలజీ తో ఆదాయం పెరుగుతుందనుకుంటే నష్టాలు జరిగాయన్నారు. తాను చిన్నప్పటి నుంచి మా గ్రామ చేనేత తో కలిసి జీవించామని, వారి బాధలు తనకు తెలుసు అన్నారు. టెక్నాలజీ పెరిగాకే చేనేత కార్మికులకు కష్టాలు ఎక్కువయ్యాయి అన్నారు. బట్టలు నేసే నేతన్నలకు లాభం లేదని వాటిని అమ్ముకుంటున్న వ్యాపారులకు మాత్రమే లాభంగా మారిందన్నారు. నేతన్నల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాస్, గట్టుప్పల సర్పంచ్ నామని జగన్నాథం, పుట్టపాక సర్పంచ్ గజం అనిత సత్యనారాయణ, తెరెడ్డిపల్లి సర్పంచ్ సింగం వెంకటేశ్వర్లు, పుట్టపాక గ్రామ చేనేత నాయకులు గజం సత్యనారాయణ, జిల్లా మార్కండేయ, గంజి వెంకటేశ్వర్లు, గజం రమేష్, గంజి కృష్ణయ్య, గోలి సాంబయ్య, ఆర్.ఎం.పి గంజి వెంకటేశ్వర్లు చేనేత కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.



# ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

### కూలీ డబ్బులు వెంట వెంటనే చెల్లించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసచారి డిమాండ్

**సంస్థాన్ నారాయణపురం,**

ఏప్రిల్ 10, ( ప్రజాజ్యోతి ) : ఉపాధి హామీ కూలీలకు పనులు చేసే చోట కనీస వసతులు కల్పించాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఎం కార్యవర్గ సభ్యుడు జి శ్రీనివాసచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామపంచాయతీ పరిధిలోని పుర్లకుంట గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీల తో సిపిఎం నాయకులు మాట్లాడారు. కూలీలు పనులు చేసే విధానాన్ని పరిశీలించారు. పనులు జరిగే చోట తాగునీరు, టెంట్లు వేయలేదని విమర్శించారు. అలాగే చేసిన పనులకు వెంట వెంటనే కూలీ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో కమ్యూనిస్టులు ఒత్తిడి చేయడంతో ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి హామీ చట్టాన్ని మార్చి విబిజి రాంజీ అనే పేరును చేర్చింది అన్నారు. కూలీల కోసం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యుడు చింతకాయల నరసింహ, రైతు సంఘం మండల కార్యదర్శి కొమ్ము మల్లేశం, నాయకులు దోనూరు యాదిరెడ్డి, ఎండి ఇజాస్, గుంటూరు తోట చారి, కవిత, ఉషమ్మ, లక్ష్మమ్మ, జానకి తదితరులు పాల్గొన్నారు

# వేంపాడు సబ్ సెంటర్ ను అకస్మిక తనిఖీ చేసిన నిడమానూరు వైద్యాధికారి డాక్టర్ అరవింద్

నిడమానూరు ,ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి):వేంపాడు సబ్ సెంటర్ ను నిడమానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అరవింద్ శుక్రవారం అకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మండలంలోని అన్ని సబ్ సెంటర్ల్ లో కూడా వైద్యసేవలు మెరుగు పరచాలని ఏఎన్ఎం1,2లకు ,ఆశావర్కర్లు కు డాక్టర్ అరవింద్ సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ సెంటర్లులో కూడా రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని డాక్టర్ అరవింద్ పేర్కొన్నారు. మండలంలోని సబ్ సెంటర్లులో ప్రతి రోజూ ఏఎన్ఎం, ఆశా వర్కర్లు అందుబాటులో ఉండాలి సూచించారు.అదేవిధంగా వీరు అందుబాటులో ఉండడంతో సబ్ సెంటర్లు పరిధిలోని రోగులకు మందులు పంపిణీ అందించడం సులువుగా ఉంటుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఏఎన్ఎం ,మండల ఆశావర్కర్లు సంఘం అధ్యక్షురాలు బారెడ్డి అనుషారెడ్డి,మంగ,పద్మ, లింగమ్మ,ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# పిచ్చిపిచ్చి ఆరోపణలు చేస్తే లీగల్ నోటీసులు ఇస్తాం: మంత్రి సీతక్క..

**భద్రాద్రి కొత్తగూడెం:హైదరాబాద్,**

అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని స్త్రీ శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. అంగన్వాడీ అంటే అమ్మఒడి అంటూ సీతక్క అభివర్ణించారు. మినీ అంగన్వాడీలను కాంగ్రెస్ ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందని.. ఆ టీచర్లకు ఇప్పుడు రూ.2 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్లు కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు. అంగన్వాడీలకు గతంలో సెలవులు కూడా ఉండేవి కాదని.. కాంగ్రెస్ సర్కార్‌లో వారికి సెలవులు ఇస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు.అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీకి దక్కుతుందని ప్రశంసించారు. మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో అంగన్వాడీ టీచర్లకు మంత్రి సీతక్క స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. స్మార్ట్ ఫోన్లు పంపిణీ సందర్భంగా తనపై వస్తున్న ఆరోపణలను సీతక్క ఖండించారు. తనపై కొంతమంది పిచ్చి వాగుడు వాగుతున్నారని ఆగ్రహించారు.

# కనుపాప... కాటేసింది...!

## మైనర్ పై మేనమామ ధాష్టికం

## ఏళ్ల తరబడి లైంగిక దాడి..

## పోలీసులను ఆశ్రయించిన యువతి

**వేములపల్లి , ఏప్రిల్ 10,( ప్రజాజ్యోతి ):**

రోజు రోజుకి మానవ సంబంధాలు దిగజారిపోతున్నాయి... కాసుల కోసం కొన్నైయితే... క్షణిక సుఖాల కోసం మరికొన్ని... వావి వరుసలు మరచి సభ్య సమాజం తలదించుకునేలా... తండ్రి తర్వాత తండ్రిలా కంటికి రెప్పలా కాపాడాల్సిన మేనమామ... మైనర్ అయిన మేనకోడలిని బెదిరించి లోబర్చుకుని... తన కామ వాంఛలు తీర్చుకుని... ఈ దాష్టికాన్ని కొనసాగిస్తూ ఉంటే...భరించలేని ఆ యువతి పోలీసులను ఆశ్రయించడంతో... ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.నల్గొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన కోడిరెక్క నాగేంద్ర అనే వ్యక్తి,తన సోదరి కుటుంబం బ్రతుకుదెరువు కోసం హైదరాబాద్ వలస పోయింది. వారి కూతురు అప్పటికి మైనర్ గా ఉన్న బాలిక వేములపల్లి లోనే ఓ సంక్షేమ విద్యాలయంలో ఉండి చదువుకుంటుండేది.మేనకోడలిపై కన్నేసిన సదరు నాగేంద్ర .ఆమె మైనర్‌గా ఉన్న సమయం నుండే బెదిరించి లోబర్చుకుని, లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ దారుణం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరిస్తూ వస్తుండటంతో, భయాందోళనకు గురైన బాధితురాలు



ఇన్నాళ్లూ మౌనంగా భరించింది. ప్రస్తుతం బాధితురాలు హైదరాబాదులో కాలేజీ చదువుతున్నప్పటికీ నిందితుడి వేధింపులు రోజురోజుకూమితిమీరడంతో, బాధితురాలు ధైర్యం చేసి హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది.ఘటన జరిగిన ప్రాంతం వేములపల్లి పరిధిలోకి రావడంతో, ప్రాథమిక విచారణ అనంతరం ఎల్బీనగర్ పోలీసులు ఈ కేసును వేములపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు వేములపల్లి పోలీసులు నిందితుడు నాగేంద్రపై పోక్సో చట్టంతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, శుక్రవారం అతడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.? సభ్య సమాజం తలదించుకునేలా ఒక మైనర్ బాలికపై వరసకు మేనమామ అయ్యి ఉండి ఇలాంటి దారుణానికి ఒడిగట్టడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# తెలంగాణ పోలీసులకు లొంగిపోయిన పీఎల్జీఏ డిప్యూటీ కమాండర్..

**హైదరాబాద్:**

తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టు అగ్రనేత, పీపుల్స్ లిబరేషన్



గెరిల్లా ఆర్మీ డిప్యూటీ కమాండర్ సోడిమల్ల కేశాలు లొంగిపోయారు. అతనితోపాటు మట్నుత్తం 42 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు. ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల నుంచి వచ్చి వీరంతా లొంగిపోయారు. ములుగు, భూపాలపల్లి మీదుగా పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోతున్నట్లు ప్రకటించారు. అనంతరం సరిహద్దుల నుంచి పోలీసులు వీరిని వాహనాల్లో హైదరాబాద్‌కు తరలించారు. మావోయిస్టు నేత హిడ్మా ను వదిలి దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీకి వెళ్లిన తర్వాత బెటాలియన్ బాధ్యతలను బడ్సే దేవాకు, కేశాలుకు అప్పగించారు. అయితే, కొన్ని రోజులు కిందటే కమాండర్ దేవా.. తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుపోయారు. ఆ తర్వాత బెటాలియన్ బాధ్యతలు నిర్వహిస్తున్న సోడిమల్ల కేశాలు సైతం తాజాగా నేడు లొంగిపోయారు. ఇతనికి సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ వంటి పేర్లున్నాయి.

## గెరిల్లా ఆర్మీ ఇక లేదు: డీజీపీ

ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఇవాళ మట్నుత్తం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయినట్లు తెలిపారు. వీరిలో బెటాలియన్ కమాండర్ సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ ఉన్నారని వెల్లడించారు. తెలంగాణ పోలీసుల ఎదుట ఆయుధాలు, బంగారంతో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసినట్లు చెప్పారు. 36 తుపాకులు, ఐదు ఏకే 47లు, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, 1,007 తూటాలతో పోలీసులు ముందు మావోలు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. అలాగే 800 గ్రాముల బంగారం సైతం అప్పగించినట్లు వెల్లడించారు. వీరి లొంగుబాటుతో అత్యంత కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ పూర్తిగా కనుమరుగైనట్లు డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు.

# జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలన..

# కవిత సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్,**

జీహెచ్ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. అనేక గ్రామాలు జీహెచ్ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్ఎండీఏకు ఛైర్మన్‌గా, వైస్ ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. 2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మరో 1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని.. కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు.నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని.. తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని.. సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు.ఈ నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు. మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని.. ప్రజలు ఆయన్ను ఎప్పుడో మర్చిపోయారని కవిత వ్యాఖ్యానించారు.'తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాను... ఎవరో చెప్తే పార్టీ పెట్టే స్థాయిలో లేను' అని కవిత స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నానమని అన్నారు. అయితే, కమీషన్ల కోసమే రిపేర్ చేయాలని ప్రభుత్వం భావిస్తోందని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కేరళం ప్రజ ల దృష్టికి తీసుకెళ్లాలని తాము వీడియో రిలీజ్ చేశామని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.